

# ఊరూ- వాడా

సొదుం జయరాం

మా ఆవిడకు బ్రెయిన్ వాష్ చెయ్యడమన్నది నా వల్ల అయ్యే పనికాదు. ఆవిడ ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చిందంటే- దాన్నుంచి ఒక్క ఇంచ్ కదలించడం కూడా కష్టమే. కానీ ఓటమిని అంగీకరించడం నాకూ ఇష్టంలేదు. మా అమ్మాయి పెళ్ళి విషయంలో మా ఇద్దరి మధ్యా పేచీ ప్రారంభమయింది.

"మీరు నూరు చెప్పండి పల్లెటూరికి అమ్మాయి నివ్వడానికి ససేమిరా నేనొప్పుకోను" అంది ఖచ్చితంగా అరుణ.

"పల్లెలంటే పూర్వంలాగానే వున్నాయనుకుంటున్నావేమో. అదేం కాదు. పల్లెలు చాలా మారిపోయినాయి. అయినా మనమ్మాయిని పల్లెటూరికివ్వడంలేదు. పల్లెటూళ్లో బి.టెక్, అబ్బాయికివ్వబోతున్నాం" అన్నాను.

"సదేలే" అంది ఈసడింపుగా అరుణ.

"నేను చెప్పేది కూడా రవ్వంత వినిపించుకోవేం అరుణా. పల్లెటూళ్లో కూడా నాగరికత పెరిగింది. రైతులంతా కిసాన్ అగ్గిపెట్టెమీద బొమ్మల్లా వుంటారనుకుంటున్నావా? అది పొరపాటు. వ్యవసాయం కమర్షియలైజ్ అయిన తర్వాత రైతులు బాగానే డబ్బు కువ్వబోసుకుంటున్నారు. తమ పిల్లల్ని మనలాగే హుందాగా కాన్వెంట్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివించుకుంటున్నారు. ఇంటింటా కలర్ టీ.వీ.లు, ఫ్రిజ్‌లు వున్నాయి. ఒకటేమిటి అన్ని స్టేటస్ సింబల్సూ వాళ్లకి అందుబాటులోకి వచ్చినాయి. రాకపోకలకు బస్సు సౌకర్యాలున్నాయి. పల్లెటూళ్లను తక్కువ చూపు చూడకు" అన్నాను ఉపన్యాసధోరణిలో.

నేను ఎంత చెప్పినా అరుణ చెవికెక్కలేదు. బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంది. నాకు నిబ్బరం సడలిపోతున్నది. ఈడ్చి కొడదామన్నంత కోపం వచ్చినా దిగమింగుకున్నాను. మా అమ్మాయి చిత్రకు ఈ సంబంధం చూసేసరికి తాతలు దిగివచ్చినంత పని అయింది. అబ్బాయి సలక్షణంగా వున్నాడు. అబ్బాయికి అమ్మాయి కూడా నచ్చింది. నా మట్టుకు నాకు కట్నానిది ఒక సమస్య కాదు. ఒక లక్ష అటో ఇటో కుదురుతుంది. కానీ ఇప్పుడొచ్చిన చిక్కల్లా మా ఆవిడతోనే. అటు పూర్తి తెలిసిందీ కాదు. ఇటు ఏమీ తెలీనిదీ కాదు.

"అబ్బాయికి ఉద్యోగం లేదు. అది ఎప్పుడు దొరుకుతుందో ఏమో. అందాకా మనమ్మాయి పల్లెటూళ్లో కాపరం చెయ్యకలుగుతుందా?" అంటూ అబ్జక్షన్ లేవనెత్తింది.

అరుణ టౌన్లో పుట్టి టౌన్లో పెరిగింది. వాళ్ల నాన్నగారు రిటైర్డ్ తహశీల్దారు. అందుకనే పల్లెటూళ్లంటే తక్కువ చూపు. నా వాదనాపటిమంతా బూడిదలో పోసిన పన్నీరైపోతోంది తప్ప ఆవిడ తలకెక్కడంలేదు. ఈ తలతిక్క మనిషితో ఎంత వాదించీ లాభంలేదనకొని ఒక రాజీసూత్రం ప్రతిపాదించినాను.

"రేపు పొద్దున్నే ఆ పల్లెకు పోదాం. ఇల్లూ వాకిలీ చూద్దాం. నీకు నచ్చితే సంబంధం ఖాయం చేద్దాం. లేదా కాన్సిల్ చేద్దాం. సరేనా?" అన్నాను.

ఆ సమయంలో పురుగులన్నీ ఒకచోట వున్నవేమో నా ప్రతిపాదనని అంగీకరించింది.

"మీరు ఒకటే నసపెడుతున్నారు. మీ పోరు పడలేకుండా వున్నాను. అలాగే కానీలేండి. మీకు తెలిసిన వాళ్ల నెవరినన్నా అడిగి జీపు అరేంజి చెయ్యండి. రేపు తెల్లవారే ప్రయాణం" అంది అరుణ. నాకు పెద్ద రిలీఫ్ దొరికినట్లయింది. అరుణకు బస్సులో ప్రయాణం చెయ్యడం నామోషీ. అట్లాఅని జీపుకోసం ఖర్చుపెట్టడం ఇష్టంలేదు. పుట్టింది డిప్యూటీ తహశీల్దారుగారింట్లో. కట్టుకున్నదేమో డిప్యూటీ ఇంజనీరుని. ఆ మాత్రం అభిజాత్యం వుండడం సహజమేననిపించింది. నిజానికి అడుక్కుని ఆడంబరాలు నాకు గిట్టవు. కానీ తప్పదు. ఒక కాంట్రాక్టరుని అడుక్కొని జీపు సంపాదించి పొద్దున్నే ఇంటిముందు నిలిపా.

మా అరుణ జీపును పరకాయించి చూసి, "ఈ డొక్కు జీపు మీకెక్కడ దొరికిందండీ" అంటూ విసుక్కున్నది.

ఏదో సామెత చెప్పినట్టుంది- "పాపమని పాతచీరె యిస్తే ఇంటి వెనుకకు పోయి మూర వేసిందట"- మా అరుణ కూడా ఆ బాపతే. ఏదో సర్దిచెప్పి జీపులో ఎక్కించడమైంది. అనుకోని ప్రయాణం, ఆ పల్లెకు ఎటు పోవాలో పూర్తిగా రూటుగూడా తెలియదు నాకు.

"ఊరిపేరన్నా జ్ఞాపకముందా మీకు" మా ఆవిడ అంది వున్నట్టుండి.

"లేకేం పాయసంపల్లె"

"పేరు అసహ్యంగా వుంది" మా ఆవిడ అంది ఆముదం తాగిన ముఖంపెట్టి.

"పేరులో ఏముందిలేద్దూ"అని సర్ది చెప్పాను.

మా ఆవిడ గమ్మున వుండిపోయింది. దారిలో ఒకటిరెండు చోట్ల జీపు ఆపి రూటు అడిగి తెలుసుకున్నాం. కమలాపురం నుంచి పది కిలోమీటర్లు. పల్లెలకు వెళ్ళేరోడ్డేకానీ శుభ్రంగా తారురోడ్డు.

"పల్లె అంటే దారీడొంకా వుండదనుకున్నాను. ఫరవాలేదు. పల్లెలకు కూడా తారురోడ్లున్నాయన్నమాట. అంతా కాలమార్పు" అంది మా ఆవిడ. పల్లె నచ్చుతుందో లేదోకాని పల్లెకు వెళ్లే రోడ్డు మా ఆవిడకు నచ్చింది. నేను సంతృప్తిగా వూపిరి పీల్చుకున్నాను.

దారికిరువైపులా పచ్చటి పొలాలు. పొలాల మీదనుంచి వచ్చే చల్లటి పైరగాలి. ప్రాణానికి ఎంతో హాయిగా వుంది. ఆహ్లాదంగా వుంది. మా ఆవిడకు ఏ అనుభూతీ వున్నట్లు లేదు. కునికిపాట్లు పడుతున్నది.

నా వేళ్ళ పల్లెటూళ్లో వున్నవి. పుట్టిపెరిగింది అక్కడే. పొట్టకోసం వుద్యోగరీత్యా టౌన్లల్లో వుండవలసివచ్చినా నాకు పల్లెపట్టులంటే ఇప్పటికీ ఇష్టమే. అందుకే పల్లెవాసన తగలగానే తలలో పాత జ్ఞాపకాలు ముసురుకున్నాయి. నా బాల్య స్మృతులన్నీ కళ్లముందు తెరమీద బొమ్మల్లా కదలసాగినాయి.

బడికి కొతకాలవు సెలవలిస్తే ఎంత సంబరం! జైలు నుంచి విడుదలయినా అంత సంతోషం వుండదేమో! మా పిల్ల జీతగాడి వెంట బీళ్లల్లోకి బర్రెలను మేపడానికి వెళ్లేవాణ్ని. అక్కడ గంటలు క్షణాల్లా గడిచిపోయేవి. ఏట్లో పడి కేరింతలు కొడుతూ గంటలుగంటలు పొద్దెరక్కుండా ఈదేవాళ్లం. చేపలూ, ఎండ్రకాయలూ పట్టి కాల్చుకుని తినేవాళ్లం. ఇంటిదారి పట్టగానే బర్రెల మీదనో, దున్నపోతుల మీదనో స్వారీ! ఈ అనుభూతులన్నీ కూడా నామట్టుకు నాకు నిన్నమొన్నటివిలా కనిపిస్తాయి. చింతాకంత దిగులులేకుండా గడిచిపోయిన చిన్ననాటి రోజులు! పల్లెటూళ్లంటే అందుకూ నాకు ప్రాణం!

పల్లెటూళ్లలో నా చిన్ననాటి దినాల్లో జీవన విధానమే వేరు. ఒక రకమైన సోషలిజం వుండేదనిపిస్తుంది. జనాల్లో ఇప్పుడుండేటంత డబ్బుపిచ్చి అప్పుడు లేదనిపిస్తుంది. పొలంపుట్రా వున్న రైతుకూ, కూలీనాలీ చేసుకొని కడుపునింపుకునే మాలామాదిగలకూ మధ్య బతుకుల్లో పెద్ద అంతరం వుండేదికాదు. మా పిల్లజీతగాడి కుటుంబానికీ, మా కుటుంబానికీ మధ్య తిండి తీర్పుల్లో తేడా కనిపించేదికాదు. పొద్దున్నే సంకటి, మధ్యాహ్నం కొర్రకూడు, రాత్రికి జొన్నరొట్టె. అందరి తిండీ ఇదే.

వరికూడు ఒక అపురూపమైన భోజనం. అది దొరకాలంటే చచ్చేంత రోగమన్నా రావాలి. లేదా పండగలో పబ్బాల్లో రావాలి! ముతక పంచెలూ, ముతక చొక్కాలూ అందరికీ అందుబాటులోవున్న దుస్తులు. దారిద్ర్యం మూలంగా వచ్చిన సోషలిజమేమో అది!

ఇవన్నీ నా చిన్ననాటి దినాలు. స్వాతంత్ర్యానికి పూర్వం వున్న రోజులు.

"ఏమిటాలోచిస్తున్నారు?" కునికిపాట్ల నుంచి తేరుకొని మా ఆవిడ ప్రశ్నించింది.

"చిన్నప్పటి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటున్నాను"

"ఛీ! నెమరువేసుకొనడమేమిటి పశువుల్లాగా"

"మనిషిలో ఏమూలో పశుప్రవృత్తి వుంటుంది"

"అది సరేగానీ పాతజ్ఞాపకాల్ని నెమరువేసుకోవడం వల్ల లాభం ఏమిటి?"

నోరు జారి పుసక్కిన పాతజ్ఞాపకాల ప్రసక్తి వచ్చింది. మా ఆవిడ లాభనష్టాల బేరీజు వేస్తున్నది. నిజానికి మా ఆవిడను అనబాపం. పాపం-పుణ్యం, మంచీ- చెడూ ఇవి కాదు కదా నేడు రాజ్యమేలుతూ మనల్ని శాసిస్తున్నది! లాభం-నష్టం ఇవీ మనల్ని శాసిస్తున్నాయి.

నేను గమ్మున వుండిపోయాను. ఆలివాక్యం! అడ్డుతగలడమన్నది శ్రేయోదాయకం కాదు. ముప్పైఐదేండ్ల నా వైవాహిక జీవితంలో నేను నేర్చుకున్నది అదే. ఆవిడ నోటంట పనికొచ్చే ముక్క ఒక్కటి రాకుండా జాగ్రత్తపడుతుంది. ఆవిడతో తగవుపెట్టుకొని ప్రయోజనం లేదు. ఆవిడ మారదు. నేనైనా మారాలి కదా?

మా ఆవిడ వూరుకోలేదు. మునుకున వుండి రాయివిసిరినట్లు నా మీద మరో ప్రశ్న సంధించింది.

"ఈ పల్లెటూళ్లల్లో మనుషులు పశువుల్లాగా ఎందుకు ఖూనీలు చేసుకుంటారు?" అని.

"కక్షలకూ కార్పణ్యాలకు ఏవో కారణాలుండి తీరతాయి. నాకు తెలియదు. అదొక పరిశోధనాంశం" అన్నాను.

"పరిశోధనాంశమా పాడా. ఒకరి బాగుచూస్తే ఒకరికి పడదు. పంటలు ఏడాదికి ఒకసారి పండితే, అసూయలూ ద్వేషాలూ రోజూ పండుతాయి. ఇక ఒకర్నొకరు నరుక్కొని చావక ఏం చేస్తారు" అంది.

నేను పరిశోధనాంశం అనుకున్న విషయాన్ని మా ఆవిడ సులభంగా తేల్చిపారేసింది. రిలీఫ్‌కోసం సిగరెట్టు తీసి వెలిగించాను. సిగరెట్టు ఇంకా పూర్తిగా కాలందే వూరు వచ్చింది. బజారు మొగన జీపు కొంచెం స్లోచేసి,

"క్రిష్టారెడ్డిగారిల్లెక్కడ?" అంటూ ఒకతణ్ని అడిగాను.

"ఈ బజారు చివర్న దేవళం పక్కన వుంది చూడు" అన్నాడు.

మేము వెళ్తున్నది ఆ వూరికి మెయిన్ బజారు లాగుంది. చక్కటి సిమెంటు రోడ్డు ఈ ఏడే రోజ్‌గార్ నిధులనుంచి వేసినట్టుంది. పల్లెటూళ్లో సిమెంట్ రోడ్డు మా ఆవిడ వూహించినట్లు లేదు. రోడ్డువైపు నోరువెళ్లబెట్టి వింతగా చూస్తోంది. జీపు క్రిష్టారెడ్డిగారింటికి చేరేలోపల చాలా వింతలూ, విడ్డూరాలు చూచింది మా ఆవిడ.

ఈ వూళ్లో హైస్కూలు కూడా వున్నట్లుంది. జట్లుజట్లుగా స్కూలుకు వెళ్తూ ఆడపిల్లలు, మగపిల్లలు, మా జీపుకు ఎదురుపడ్డారు. అంతా అత్యంతాధునిక దుస్తుల్లో వున్నారు. పల్లెల్లో ఇంతసీను వుంటుందని కూడా మా ఆవిడ ఊహించలేదు. పల్లెల పట్ల మా ఆవిడకున్న ప్రెజుడిస్ తొలగిపోయింది.

"ఫరవాలేదు. పల్లెలు బాగానే అభివృద్ధి చెందినట్లున్నాయి" అంది మా ఆవిడ.

"స్వాతంత్ర్యం వచ్చి యాభైరెండేళ్లయింది. ఈ మాత్రమన్నా అభివృద్ధి చెందకపోతే ఎట్లా?" అన్నాను.

జీపు క్రిష్టారెడ్డిగారి ఇంటిముందు ఆగింది. కాంపౌండు తెరుచుకొని లోపలికి వెళ్లాం. పాతకాలపు ఇల్లేకాని చాలా అట్టహాసంగా వుంది. కడప కంచురాయితో కట్టబడింది.

అలికిడి విని క్రిష్టారెడ్డిగారి భార్య అనుకుంటాను- బయటికి వచ్చి మావైపు ఎవరూ? అన్నట్టు చూసింది.

ఎవరమైందీ, ఎందుకొచ్చిందీ చెప్పినాను. ఆమె నాలుక కరచుకొని ఎవరో అనుకున్నాను. "లోపలికి రాండి" సాదరంగా ఆహ్వానించింది.

ఇంట్లోకి వెళ్లి కాళ్లూ ముఖం కడుక్కొని కూర్చున్న తర్వాత ఆమె గడపలో నిలబడి, "కాఫీ తీసుకుంటారా? కూల్ డ్రింకా" అంది.

> ఇంట్లో కలర్ టీ.వి.వుంది. ఖరీదైన ఫర్నిచర్ వుంది. ఫోన్ వుంది. ఫ్రిజ్ వుంది. ఈ స్టేటస్ సింబల్స్ చూచిన తర్వాత మా ఆవిడకు నాగరికత గల కుటుంబంగా కనిపించక మరొకలా కనిపించే అవకాశమెక్కడ?

"తొమ్మిదిన్నర అయింది. కూల్‌డ్రింక్ ఎందుకమ్మా. కాఫీ వుంటే చాలు" అన్నాను.

"కాఫీ అయితే ఫ్లాస్కులో రెడీగా వుంది. ఆయన కోసం ఊళ్లోవాళ్లో, బయటివాళ్లో సందులేకుండా వస్తూనే వుంటారు. ప్రతిసారీ కాఫీ పెట్టాలంటే బరువు. అందుకని ఫ్లాస్కులో పోసి వుంచుతాను. తెస్తానుండండి" అంది.

"అడగటం మరచా. క్రిష్టారెడ్డిగారు ఎక్కడ?" నేనడిగా.

"ముందు కాఫీ తెస్తాను. తర్వాత ఆయన విషయం చెబుతా" అని ఆమె సన్నగా నవ్వుతూ లోనికి వెళ్లింది.

"కొత్తాపాతా అన్న బెరుకు లేదు. మంచి కలుపుగోలు మనిషిలా వుంది" అన్నాను మా ఆవిడతో.

మా ఆవిడకు నా మాట వినిపించినట్లు లేదు. ఇల్లూ, ఇంట్లో వస్తువుల్నీ కన్నార్పకుండా చూస్తోంది. కాసేపున్న తర్వాత, "ఫరవాలేదండీ. నాగరికత వున్న కుటుంబమే" అంది.

ఇంట్లో కలర్ టీ.వి.వుంది. ఖరీదైన ఫర్నిచర్ వుంది. ఫోన్ వుంది. ఫ్రిజ్ వుంది. ఈ స్టేటస్ సింబల్స్ చూచిన తర్వాత మా ఆవిడకు నాగరికత గల కుటుంబంగా కనిపించక మరొకలా కనిపించే అవకాశమెక్కడ?

క్రిష్టారెడ్డిగారి భార్య ట్రేలో కాఫీ కప్పుల్తో ప్రత్యక్షమైంది.

కాఫీ తీసుకొని తాగుతుండగా ఆమె అంది, "అన్నా ముందుగా మీరు ఫోన్‌చేసి వచ్చింటే బాగుండేది. ఆయనేమో డికార్టికేటింగ్ మిషన్ వద్ద వేరుశనక్కాయలు పప్పు ఆడిస్తున్నాడు. ఊళ్లోనే అనుకో. కానీ చాలా బిజీగా వుంటాడు. పప్పు కొనుగోలుకు ఎవరో వచ్చినట్లుంది. తూకాలు వేయించి బస్తాలకెత్తించాల. మధ్యాహ్నాం అన్నం అక్కడికే పంపమన్నాడు" అంది.

ముందు చెప్పాపెట్టకుండా రావటం పొరపాటే అనిపించింది. ఆమె మా పొరపాటును ఎత్తి చూపుతున్నట్లనిపించింది. అపరాధ మనస్తత్వం ఫీలయ్యాను.

"మీకు ఫోన్ వున్న విషయం తెలియదమ్మా. అనుకోకుండా బయలుదేరి వచ్చాం. పొరపాటే" అన్నాను నొచ్చుకున్నట్లుగా.

"ఫరవాలేదన్నా. రావడం మంచిదే. మాకు ఫోనున్నట్లు తెలియకపోవడం వల్ల పొరపాటు పడినారు. ఈ వూళ్లో పెద్దరైతులందరికీ ఫోన్లున్నాయి. డికార్టికేటింగ్ మిషన్‌కు ఫోన్ చేస్తాను. మీరు మాట్లాడండి" అంటూ ఫోను డయల్‌చేసి రింగ్‌కాగానే రిసీవర్ నా చేతికిచ్చింది.

క్రిష్టారెడ్డిగారికి ఫోన్‌లో నేనొచ్చిన విషయం చెప్పాను. ఆయన ఒక గంట తర్వాత ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. నాకు కొంచెం రిలీఫ్ దొరికింది.

"అడగటం మరచాను. అబ్బాయి కనిపించడే?" అన్నాను.

"హైదరాబాదులో ఏదో ఇంటర్వ్యూ వుందని మూడు రోజుల కిందట పోయినాడు. ఈ రోజు రావచ్చునేమో" అంది.

"ఇంటర్వ్యూనా? ఏ కంపెనీలో?" అంది మా ఆవిడ కుతూహలంగా.

"మహేంద్ర అండ్ మహేంద్ర అనుకుంటాను"

"ఉద్యోగమేమన్నా వచ్చే అవకాశాలేమైనా కనిపిస్తున్నాయా?"

"మినిస్టర్ రెకమెండేషన్ కూడా వుంది. ఆ తర్వాత మన అదృష్టం"

మా మధ్య కాసేపు మౌనం తాండవించింది. ఏదో పని వున్నట్లుగా క్రిష్టారెడ్డి భార్య ఇంట్లోకి పోయింది. ఇదే అదనుగా మా ఆవిడ నాకు దగ్గరగా జరిగి రహస్యం చెబుతున్నట్టు అంది.

"ఏమండీ, ఈ సంబంధం ఖాయం చేసుకుందామండి"

"ఉద్యోగం దొరుకుతుందని భరోసా ఏమిటి?"

"దొరక్కపోయినా ఫరవాలేదు."

మొత్తానికి మా ఆవిడ ప్లేటు ఫిరాయించి సంబంధాన్ని ఓ.కే. చేసింది. నాకు కావలసిందీ అదే.

"మీరు పేపరు చూస్తూ వుండండి. నేను లోపలికి పోతున్నాను" అంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది. బహుశా కాకా పట్టడానికనుకున్నాను. పది నిముషాల్లో పేపరులోని హెడ్‌లైన్స్ అన్నీ చూచి పేపరు టేబిల్‌మీద పడేశాను. లోపల మా ఆవిడా, క్రిష్టారెడ్డిగారి భార్యా పిచ్చాపాటి ఫ్రీగా మాట్లాడుకుంటున్నారు. ఒక్కడికీ ఏమీ తోచడంలేదు. లేచి మెల్లగా వచ్చి వరండాలో నిలబడ్డాను.

పక్కనే వున్న దేవళంలో ఏదో గొడవ జరుగుతున్నట్లుంది. చాలామంది జనం పోగయ్యారు. అంతా గలగలా ఏదో మాట్లాడుతున్నారు. కానీ ఏదీ స్పష్టంగా

> "సూసినావురా పోరంబోకు నాకొడకా. నా లంగాకు జేబు యాడుందిరా. ఇయ్యాల చేలోకాయలు తిన్యాను. కే.జీ. కాయలు తిన్నాను. నువు ఒక అమ్మకూ, నాయనకూ పుట్టిన్నాకొడుకువైతే కడుపుకోసి సూడాల. రారా. నా కడుపు కొయ్యరా" అంటూ రయ్యిన దయ్యంపట్టిన మనిషిలా పోయి నర్సిగాడి చొక్కా పట్టుకొని ఈడ్చింది. వాడు దాదాపు తూలి కిందపడబోయాడు. నిలదొక్కుకొని ఆమె మీద చెయ్యిచేసుకోబోతే పక్కనున్న మనిషి ఆపాడు. అలా రసాభాసగా ముగిసింది ఆ తీర్పు.



వినిపించడంలేదు. అక్కడికి పోతే కాసేపు కాలక్షేపమన్నా అవుతుందనిపించింది. ముక్కూమొగం తెలియనివాళ్ల మధ్యకు వెళ్లడం ఏం బాగుంటుంది అన్న సంశయమూ కలిగింది. నిజానికి నా వృత్తి ఏదైనా ప్రవృత్తి పల్లెటూరికి సంబంధించిందే! అనుకోకుండానే నా కాళ్లు అక్కడికి లాక్కెళ్లాయి. దేవళం బయట నిలబడి బీడీ దమ్ములు లాగుతున్న ఒకాయ నను అడిగాను.

"ఏమిటి విషయం. ఇంతమంది ఎందుకు పోగయ్యారు ఇక్కడ?"

"దొంగతనం కేసులే" అన్నాడతను నిర్లక్ష్యంగా.

"నగదా? సొత్తులా?"

"నగదూ కాదు, సొత్తులూ కాదు. వేరుశనక్కాయలు"

"అట్లనా. ఎన్ని మూటెలు?" అన్నాను ఆసక్తిగా.

"మూటెలూ కాదు. పాదూ కాదు. రెండుమూడు కే.జీ.లు"

"దానికింత రాద్ధాంతమా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అదిగాదయ్యా. ఈ పొద్దు వంకాయ అవుతుంది. రేపు ఇంకోటి అవుతుంది. గ్రామంలో ఒక కట్టుబడీ, కమశిచ్చనా లేకపోతే ఈ అలగాజనంతో ఏగలేమయ్యా"

"మంచిది. ఏం చేస్తారు ఆ దొంగని?"

"పోయిన దినాల్లో ఐతే నాలుగేట్లు పిర్రెలు వాయగొట్టి ఇడ్సి పెట్టేవాళ్లం. కాలం మారిపాయ. తంతే పోలీసుటేసన్‌కు పోతారు. ఎవురు సెప్పిరి ఆసావు. ఊరి పెద్దోళ్లే జరీమానా ఏస్తారు" అన్నాడు.

ఈ ప్రజాకోర్టు తీర్పు చూడాలనిపించింది. దేవళంలోకెళ్లాను. తీరా చూస్తే దొంగతనం చేసింది మగవాడు కాదు. నడిప్రాయం ఆడమనిషి! తలొంచుకొని నిలబడి వుంది. చుట్టూ వున్నవాళ్లు తలాఒక తిట్టు తిడుతున్నారు. కౌరవసభలో నిలబడ్డ ద్రౌపదిలాగుంది ఆమె పరిస్థితి! కాసేపటికి గ్రామ పెద్దలంతా వచ్చి దేవళంలో కూచున్నారు. గొడవ సద్దుమణిగింది.

"ఒరే నర్సిగా ఎందిరా విషయం" అన్నాడు ఒక గ్రామ పెద్ద.

చేతిలో కర్రవున్న నర్సిగాడు ముందుకు వచ్చాడు. పబ్లిక్ ప్రాసిక్యూటరులా కేసు రెప్రజెంటు చేశాడు. చేతిలో కర్ర వుండటాన్ని బట్టి వాడు పొలం కావలివాడని వూహించాను. నా వూహ కరక్టే.

"తూర్పు గయినికాడ కాయిలున్నానబ్బా. పొలంనుంచీ అందరి కూలోళ్లతోబాటూ ఈ మరియా వచ్చింది. నా కను మానమేసి క్యారియర్ సూసవమన్నాను. సూపలేదు. బలంతంగా గుంజుకొని చూస్తే కాయలుండాయి. ఈడికి తొడకొచ్చినా" అన్నాడు.

"ఏమ్మే. నిజమేనా?" గద్దించాడు పెద్దమనిషి. రెడ్‌హేండెడ్‌గా దొరికిపోయింది. ఇక ఏం చెప్పుంది అనుకున్నా. కానీ రుద్రకంఠంతో ఆమె గోడు వెళ్లబోసుకుంది.

"సత్తెప్రమానకంగా సెబుతాండానబ్బా. నేను దొంగనూ, ముచ్చునూ కాదు. మా సంటోడు వుడికేసిన కాయల్లో అని మూన్నాళ్లనుంచీ ఒకటేగా సతాయిచ్చాండాడు. పాపం నా బిడ్డ కాయలకోసం యంత మొగమాసినాడో. రేత్తిరి నిద్దర్లో కాయలు... కాయలని కలవరిచ్చినాడు. వాని కోసమని ఈ కాసిని కాయలు కోసుకున్నా. మీ వాములకాడ కుక్కలూ కోళ్లూ తినిపోతాండాయి. ఆపాటి విలువ సెయ్యబీకాయలు. పొలం మీద పండులుపడి తినిపోతాండాయి. నేను వసిపిల్లోని కోసం రొన్ని కాయలు కోసుకుంటే దానికే నర్సిగాడు నామీద ఏందో పాతకసి పెట్టుకొని దొంగతనం అంటగట్టినాడు" జొటజొట కన్నీరు కారుతుండగా ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. కానీ పెద్దమనిషి ఏ మాత్రం స్పందించలేదు.

"నీ శ్రీరంగనీతులు చాలుగానీ నీకు యాభై రూపాయలు జరీమానా వేసినాం. మాపటేలలోగా జుల్మానా కట్టు. ఆ కాయలు అక్కన్నే పోసిపో" అన్నాడు. ఆమె కన్నీళ్లు తుడుచుకుంటూ ఆ కాయలు అక్కడే కుమ్మరించింది. వెళ్లిపోయేం



దుకు మూడడుగులు ముందుకు వేసింది.

"వుండు" నర్సిగాడు అరిశాడు. ఆమె ఠక్కున ఆగింది.

"ఈ కూలిముండలకందరికీ లంగాలకు జేబులుండాయి. ఆ జేబుల్లో గుడకా కాయలేసుకుంటారు. అదీ కూడా తనిఖీ చేయాలబ్బా" నర్సిగాడు అన్నాడు.

అక్కడికి వాడు కూలిముండాకొడుకు కానట్లు!

ఈ మాట మరియకు ఈటెపోటులా పొడుచుకుంది. ఆవేశంతో వూగిపోయింది. సర్రున చీరెపైకెత్తి లంగాచూపి,

"సూసినావురా పోరంబోకు నాకొడకా. నా లంగాకు జేబు యాడుందిరా. ఇయ్యాల చేలోకాయలు తిన్నాను. కే.జీ. కాయలు తిన్నాను. నువు ఒక అమ్మకూ, నాయనకూ పుట్టి న్నాకొడుకువైతే కడుపుకోసి సూడాల. రారా. నా కడుపు కొయ్యరా" అంటూ రయ్యిన దయ్యంపట్టిన మనిషిలా పోయి నర్సిగాడి చొక్కా పట్టుకొని ఈడ్చింది. వాడు దాదాపు తూలి కిందపడబోయాడు. నిలదొక్కుకొని ఆమె మీద చెయ్యిచేసుకోబోతే పక్కనున్న మనిషి ఆపాడు. అలా రసాభాసగా ముగిసింది ఆ తీర్పు.

ఇక నాకు అక్కడ ఒక్క నిముషం వుండబుద్ధిపుట్టలేదు. బరువెక్కిన గుండెతో నేనక్కడనుండి వచ్చేసరికి క్రిష్టారెడ్డి వచ్చాడు. గతికితే అతకదని మేమక్కడ భోంచెయ్యదలచుకోలేదు. అదీగాక పాపం ఆయన బిజీగా వున్నాడు. ఒకరోజు ఆయనే మావూరికొచ్చే ఏర్పాటుచేసి మేం జీపులో బయలుదేరాం.

"ఊళ్లు బాగా అభివృద్ధి చెందినాయండీ. ఫరవాలేదు. ఈ సంబంధం ఖాయం చేయండి" అంది మా ఆవిడ.

ఊర్లు బాగానే వున్నాయి. బాగాలేంది వాడలే. ఆ విషయం నాకు అర్థంగాట ముందు అవగతమైంది. అందుకని మా ఆవిడతో ఏం మాట్లాడకుండా ఆ విచారంలో పడి మౌనంగా వుండిపోయాను.

●



## విడాకులు తీసుకోవాలా? వద్దా?

యం.యస్.ఐ, ముంబాయి

నా వయస్సు 29. తెలుగువాళ్లమేకానీ చదువుకున్నది పెరిగిందీ ముంబైలోనే. ఆరేళ్ల క్రితం నా పెళ్ళి హైదరాబాద్‌లో వుండే అతనితో జరిగింది. అతను నన్ను ఎక్కడో పెళ్ళిలో చూసి ఇష్టపడటం... కబురుచేయడం... వెంటపడటం చివరికి అతనితోనే పెళ్ళి... కాపురానికి హైదరాబాద్ వెళ్లడం వెంటవెంటనే జరిగిపోయాయి. పెళ్ళికిముందే నాకు ఒకతనితో లవ్‌ఎఫైర్ ఉండేది. ఆ వ్యవహారం ఎలా ఫెయిల్ అయిందీ వివరంగా నా భర్తతో పెళ్ళికి ముందే చెప్పాను. నువ్వంటే నాకు ఇష్టం. నీ గతంతో పనిలేదు అన్నాడు. మా అత్తవారింట్లో ఉమ్మడి కుటుంబం. ఐదుగురు అన్నదమ్ములు. అందరిలో ఇతనే చిన్నవాడు. ఆర్నెల్లవరకూ నన్ను అందరూ చాలాబాగా చూసుకున్నారు. అప్పుడప్పుడు తాగుడు అలవాటున్న నా భర్త రెగ్యులర్‌గా తాగుబోతు అయ్యాడు. బాగా డబ్బున్న వాళ్ళు కావడంతో పెద్దగా పనిచేసే అవసరం వుండేదికాదు. ఫ్రెండ్స్... విలాసాలు రాత్రి ఎప్పుడో ఇంటికి రావడం ఇదీ అతని దినచర్య. నాకు పాప పుట్టింది. పాప అంటే అందరికీ ప్రాణం. నా భర్తకు నేను తప్ప మరే స్త్రీతోనూ ఎలాంటి సంబంధంలేదు. కానీ నాపట్ల ప్రేమ వ్యక్తం చేయడంలో అతను ఫెయిల్ అయినట్లు అనిపించేది. ఇంట్లో అంతమంది వున్నా ఏదో ఒంటరితనం. వ్యాపారంలో హెల్ప్ చెయ్యి నీకూ టైంపాస్ అవుతుంది. పాపను నేను చూసుకుంటాను అనేది మా అత్తగారు. సరిగ్గా ఆ సమయంలో బొంబాయిలోని నా లవర్ హైదరాబాద్‌లో తారసపడటంతో నా మనస్సు చలించింది. అతనికి హైదరాబాద్‌లోనే ఉద్యోగమట. ఇంకా పెళ్ళికాలేదు. అతనితో నా ప్రేమ ఫెయిల్ కావడంలో తన ప్రమేయంలేదనీ... విధి మమ్మల్ని విడదీసిందనీ చెప్పాడు. నేను పూర్తిగా నమ్మాను. అతన్ని క్షమించాను. నేను ఖాళీగా వుంటున్నాని తెలిసి తను పనిచేసే కంపెనీలోనే నాకు ఉద్యోగం ఇప్పించాడు. ఒకవేపు నా భర్త ప్రేమరాహిత్యం... తాగుడు... నన్ను పట్టించుకోకపోవడం... మరోవైపు నా బాయ్‌ఫ్రెండ్ నన్ను స్నేహపూర్వకంగా చూడటం ఈ రెంటిమధ్య నలిగిపోయి చివరకు నా మనస్సు అతనివైపే మొగ్గు చూపింది. నా పరిస్థితిని అర్థం చేసుకున్నాడతను. నాకోసం బొంబాయి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఇంట్లో నా భర్తతో ఓరోజు చిన్న కారణంమీద పెద్ద గొడవ జరిగింది. మర్నాడే పాపను తీసుకుని బొంబాయి వచ్చేశాను. ఈ మూడేళ్ళుగా అమ్మానాన్నల దగ్గర వుంటున్నాను. నా బాయ్‌ఫ్రెండ్‌తో స్నేహం కొనసాగుతూనే వుంది. నా భర్త తరచూ బొంబాయి వస్తూనే వున్నాడు. ఎన్నోసార్లుగా నన్ను రమ్మని బ్రతిమాలుతున్నాడు. నా మనస్సు బాయ్‌ఫ్రెండ్ వేపు లాగుతోంది. నేను విడాకులు తీసుకుంటే అతను రెడీ. నేనం చేయాలి? సలహా ఇవ్వండి.

*చూడమ్మా యమ్మెస్సై... నీ మానసిక స్థితిని మా వార్త పాఠకులకు తెలియచేయడానికే నీ ఉత్తరాన్ని మొత్తంగా ప్రచురిస్తున్నాను. లేకపోతే నీ మొత్తం సమస్యకు సమాధానం రెండే వాక్యాలు. (1) నీ ఊహాలోక విహారాలు మానేసి బొంబాయి ప్రేమనూ... ప్రేమికుణ్ణీ బొంబాయిలోనే వదిలేసి హైదరాబాద్ వెళ్లడం. (2) నీ భర్తచేత తాగుడు మాన్పించే ప్రయత్నం చేస్తూ అతనితో బుద్ధిగా ఆ ఉమ్మడి కుటుంబంలో కాపురం చేయడం. నీ పాప క్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని నేనిచ్చే సలహా ఇదే!*

-చల్లా సుబ్రహ్మణ్యం